క్లుప్తంగా

నూతన నియామకం



నర్సింహులుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వినయ్‌కుమార్

కుల్కచర్ల: మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో సోమవారం మత్స్యకార సంఘం గ్రామ కమిటీ ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించారు. జిల్లా కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టార్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కావలి నర్సింహులు ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా సప్పమోని మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా హుస్నాబాద్ బందయ్య, డైరెక్టర్లుగా వెంకటయ్య, రాములు, శ్రీను, హరినాథ్, సాయిలమ్మ, చంద్రమ్మ తదితరులు ఎన్నికయ్యారు.

వైభవం.. బోనమ్మ బోనం



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గోనూర్ గ్రామంలో ఊరడమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం బోనమ్మ అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పువాయిద్యాల మధ్య మహిళలు బోనాలతో తరలివచ్చి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులందరినీ సల్లంగా చూడు తల్లీ అని అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. బుధవారం ఊరడమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



ఎల్మకన్నెలో ప్రతిష్ఠించిన బొడ్రాయి

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఎల్మకన్నె గ్రామంలో సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన అనంతరం డప్పువాయిద్యాలతో మహిళలు బోనాలతో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

సంకిరెడ్డిపల్లికి బస్సు నడపండి

తాండూరు రూరల్: మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు. బస్సు రాకపోవడంతో గ్రామస్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి అధిక చార్జీలు వెచ్చించి ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు కల్పించుకొని ఆర్టీసీ బస్సును సంకిరెడ్డిపల్లి గ్రామానికి ఒక్కపూటనైనా నడిపించాలని కోరుతున్నారు.

పంచాయతీలకే 'పవర్'

- పుంజుకోనున్న పల్లెల ప్రగతి
- గ్రామ సభల ఆమోదంతో అభివృద్ధికి నిధుల వినియోగం
- జీఓ 91తో కొనసాగుతున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు



నర్సాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్: ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపట్టింది. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం భావించి నిధుల వినియోగం విషయంలో పల్లెలకే అధికారం ఇచ్చింది. ఎటువంటి కొర్రీలు లేకుండానే పంచాయతీలకే పూర్తి స్వేచ్ఛనిచ్చింది. దీంతో పల్లెలు ప్రగతి వైపు పరుగులు పెట్టనున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 91తో గ్రామాలకు ఊరట లభించింది. అత్యవసర సమయంలో అభివృద్ధి పనులకు ఆటంకాలు తొలగనున్నాయి. గతంలో గ్రామ పంచాయతీలలో ఏదైనా అభివృద్ధి పనులు చేపట్టాలంటే ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. పనులు నత్తనడకన సాగేవి. ఉన్నతాధికారుల నుంచి సకాలంలో అనుమతులు లభించక అత్యవసర పనులు కూడా నిర్వహించలేని దుస్థితి ఉండేది. దీంతో పల్లెల్లో అత్యవసర పనులు ఉన్నా చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు సర్పంచ్‌లు తరచుగా ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఈ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. దీంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామసభల ఆమోదంతో నిధుల ఖర్చు..

మండలంలో 33 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 91తో ప్రస్తుతం ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు పుంజుకుంటున్నాయి. ఎలాంటి ఆటంకం లేకుండానే పనులు వేగంగా ముందుకు కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని అనుబంధ గ్రామాల్లో గతంలో కుంటుపడ్డ పనులు జీఓ ద్వారా వేగంగా ముందుకు సాగుతున్నాయి. జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం ఎస్ఎఫ్‌సీ నిధులను అందజేస్తోంది. కొత్త జీఓ విడుదలతో పల్లెల్లో పనులు వేగంగా జరగడంతో ప్రజలు సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ముందుగా డీఎల్‌పీఓ ద్వారా డీపీఓ, కలెక్టర్ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించేవారు. రూ.లక్షలోపు నిధులు జిల్లా పంచాయతీ అధికారికి, రూ.3 లక్షల పైన ఖర్చుల ఆమోదం కోసం కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా అవసరమయ్యేది. దీంతో పల్లెల్లో అత్యవసర పనుల విషయంలో ఎంతగానో జాప్యం జరిగేది. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 91 ద్వారా పల్లెల్లో ఎలాంటి సమస్యలు లేకుండా అత్యవసర పనులను గ్రామసభల ద్వారా నిధులను తీర్మానం చేసుకొని పనులను వెంటనే చేపట్టవచ్చునని ప్రజలు అంటున్నారు.

జీఓ 91 జారీతో ప్రయోజనాలు..

- ▲ ప్రభుత్వం జారీ చేసిన కొత్త జీఓ 91 ప్రకారం గ్రామాల్లో పనులను వెంటనే చేపట్టవచ్చు.
- ▲ గ్రామంలోని పనులను గుర్తించి గ్రామసభ ద్వారా తీర్మానం చేసి ఆమోదం పొందిన వెంటనే నేరుగా నిధులను ఖర్చు చేయవచ్చు.
- ▲ ఉన్నతాధికారుల అనుమతులు అవసరం లేదు.
- ▲ దీని ప్రకారం గ్రామంలో తలెత్తే నీటి ఎద్దడి, పల్లె ప్రగతి పనులు, మురుగుకాల్వల నిర్మాణం, రోడ్లకు మరమ్మతు చేయడం వంటి పనులకు వెసులుబాటును కల్పించారు.

నిబంధనల మేరకు ఖర్చు చేయాలి



ప్రభుత్వం విడుదల చేసిన కొత్త జీఓ ప్రకారం పంచాయతీలలో పనులను చేపట్టేందుకు గ్రామసభల ద్వారా ముందుగా ఆమోదం తెలుపుకోవాలి. దాని తర్వాత నేరుగా అభివృద్ధి పనులకు ఎంత నిధులు కావాలో గ్రామస్తుల అందరి సమక్షంలో తీర్మానించి నిధులను వెచ్చించుకోవచ్చు. పల్లెల్లో చేపట్టే ఆయా అభివృద్ధి పనులను సర్పంచ్‌లు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే పంచాయతీ నిధులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

– రవీందర్, ఎంపీఓ, దౌల్తాబాద్

తాగునీటిని సరఫరా చేయండి



మోమిన్‌పేటలోని కేసారంలో ఖాళీ బిందెలతో కాలనీవాసులు

మోమిన్‌పేట: పండుగ పూట కూడా తాగునీటిని సరఫరా చేయకపోతే ఎలాగని ఆ కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. నెల రోజులుగా ఆ కాలనీలో తాగునీటి సరఫరా చేయడం లేదని వారు వాపోతున్నారు. మండల పరిధిలోని కేసారం గ్రామ 9వ వార్డులో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల నుంచి నీటిని సరఫరా చేయాలని పంచాయతీ సిబ్బందిని కోరుతున్నా వినిపించుకోవడం లేదన్నారు. పలుమార్లు పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తుందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడిగా రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

మర్పల్లి: ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడిగా పంచలింగాల ఎంపీటీసీ రవీందర్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మర్పల్లి మండలంలో 14 మంది ఎంపీటీసీలు ఉండగా అందులో శ్రీవిద్య (కల్‌ఖోడ), బాల్‌రెడ్డి (బూచన్‌పల్లి), సుజాత వెంకట్‌రెడ్డి (కోట్‌మర్పల్లి), బుజ్జమ్మ (కొంషెట్‌పల్లి), స్వప్న, మంజుల (పట్లూర్), ఎంపీపీ బట్టు లలిత (సిరిపూరం) కలిసి అధ్యక్షుడిగా రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఎండీ ఫసియొద్దీన్‌తో కలిసి రవీందర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎంపీటీసీల సమస్యల కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు రవీందర్‌రెడ్డి, పట్లూర్ రవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న హరిశంకర్

మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరిశంకర్

మోమిన్‌పేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరిశంకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దుర్గంచెర్వు గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను సర్పంచ్ హరిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. చదువుతో పాటు క్రీడలకు సమయం ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణించిన వారికి భవిష్యత్తులో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ఆయన తెలిపారు. అనారోగ్యంతో పాటు శారీర దారుఢ్యం మెరుగుపడుతుందన్నారు. 10 టీంలు టోర్నమెంటులో పాల్గొనగా విజేత జట్టుకు మొదటి బహుమతిగా రూ.10 వేల నగదు, రెండవ బహుమతిగా రూ.5 వేల నగదుతో పాటు షీల్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తిర్మలాపూర్‌లో కబడ్డీ పోటీలు

పూడూరు: క్రీడలతోనే సత్సంబంధాలు ఏర్పడతాయని డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య అన్నారు. మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో నవాబుపేట్‌కు చెందిన జట్టుకు మొదటి బహుమతి, తిర్మలాపూర్ జట్టుకు ద్వితీయ బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అంగడిచిట్టంపల్లి గ్రామంలో..

క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పూడూరు మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మదాస్, ఎంపీడీఓ సత్తయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీశైలంగౌడ్, చెన్నయ్య, నిర్వాహకులు రైనాచంద్, రాజేందర్‌గౌడ్, నర్సింహులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొంపల్లి గ్రామంలో..

దోమ: మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో ఆదివారం జెడ్పీటీసీ నాగిరెడ్డి కేఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలలోని యువత క్రీడలను అలవాటు చేసుకున్నప్పుడే శారీరక దృఢత్వం పెంపొందుతుందని జెడ్పీటీసీ అన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు గ్రామ సర్పంచ్ కోళ్ల సురేశ్, ఎంపీటీసీ రాములుతో కలిసి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా రూ.6 వేలు, రెండవ బహుమతిగా రూ.4 వేల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు మశ్చందర్ రెడ్డి, ఉపసర్పంచ్ రఫీక్ పాషా, పాఠశాల చైర్మన్ అనంతయ్య, శ్రీనివాస్, బీఆర్ఎస్‌నాయకులు షఫీ, షేర్‌ఖాన్, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఊరడమ్మ ఉత్సవాలు

పాల్గొని పూజలు చేసిన ఎమ్మెల్యే యాదయ్య



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

నవాబుపేట: మండల పరిధిలోని నారెగూడలో జరుగుతున్న ఊరడమ్మ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆదివారం పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల ఆటలతో గ్రామమంతా మారుమోగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, సర్పంచ్ పర్మయ్య, పూలపల్లి సర్పంచ్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ విఠల్‌రెడ్డి, గ్రామ పెద్దలు మైపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, రఘునందన్ రెడ్డి, చంద్రారెడ్డి, శివరాజ్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, భూషణం, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

యాలాల: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని అగ్గనూరులో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీలు సోమవారంతో ముగిశాయి. స్థానిక యువజన సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. వాలీబాల్‌లో నందకిషోర్, శేఖర్ టీంలు, క్రికెట్‌లో కాకా 11, సుధీర్ టీంలు, కబడ్డీ పోటీలో సాయి, గోపి టీంలు విజేతలుగా నిలిచారు. ఆయా టీంలకు గ్రామ సర్పంచ్ భీమప్ప బహుమతులు అందజేశారు. వార్డు సభ్యుడు వీరేశం, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీశైలం, పోటీల నిర్వాహకులు పాండు, సుదర్శన్, మోసిన్, అజీజ్, రాంమోహన్, హాజీ, గోపి పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీని బలోపేతం చేస్తాం

కొడంగల్: వైఎస్సార్‌టీపీని కొడంగల్ నియోజకవర్గంలో బలోపేతం చేస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తమ్మళి బాల్‌రాజ్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి అభిమానులు నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్నారని అన్నారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి మేలు చేశాయని చెప్పారు. ప్రతీ గ్రామంలో జెండావిష్కరణ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ కమిటీలను నియమించి పార్టీను సంస్థాగతంగా బలోపేతం చేస్తామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

నేడు కంటి వెలుగుపై మద్వాపూర్‌లో ర్యాలీ

బంట్వారం: కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం మద్వాపూర్ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ వరకు మద్వాపూర్‌లో కంటి వెలుగు శిబిరం ఉంటుందన్నారు. గ్రామస్తులు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్

కుల్కచర్ల: నిరుపేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన దోరెమోని శ్రీనివాస్ సోమవారం అనారోగ్య సమస్యతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి స్థానిక నేతలతో అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా రూ.5 వేలను అందించారు. కార్యక్రమంలో బ్లాక్‌ అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, నాయకులు బాల్‌రెడ్డి, రఘు, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పరిగి: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేష గిరిశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు సూచించారు. అన్ని శాఖలపై సమావేశం నిర్వహిస్తామన్నారు. కావున మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఇంటి నుంచే బిల్లులు చెల్లించండి

కొడంగల్: నియోజకవర్గంలోని విద్యుత్ వినియోగదారులు వారి ఇళ్ల నుంచే బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ట్రాన్స్‌కో వెబ్‌సైట్, యాప్, ఫోన్‌పే తదితర సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని బిల్లులు చెల్లించాలన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చునన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే స్థానికంగా ఉండే సబ్‌స్టేషన్‌లోని ఈఆర్‌ఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



అనంతగిరి: నాయకులతో కలిసి పతంగులు ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్



పరిగి: సంక్రాంతి సందర్భంగా ముగ్గులు వేస్తున్న మహిళలు



బంట్వారం: యాచారంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి, కనుమ పండుగలను ఆది, సోమవారాల్లో ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు, యువతులు ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి రంగులు అద్ది గొబ్బెమ్మలు పెట్టగా, చిన్నారులు పతంగులను ఎగురవేయడంలో పోటీ పడ్డారు. పిండి వంటలను ఆస్వాదిస్తూ పండుగను సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా పలుచోట్ల కబడ్డీ, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



బొంరాస్‌పేట: ముంగిట్లో ముగ్గు వేస్తున్న మహిళలు



ధారూరులో ఇంటి ఎదుట ముగ్గు వేస్తున్న యువతి



పెద్దేముల్: మంబాపూర్‌లో..



మోమిన్‌పేటలోని ఏన్కతలలో రంగవల్లి వేస్తున్న చిన్నారులు

బీఆర్ఎస్‌తోనే పేదలకు న్యాయం

ఎంపీటీసీ ప్రవీణ్‌పటేల్



ఇందూరులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ

పెద్దేముల్: అనారోగ్యానికి గురైన వారికి బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటూ, సీఎంఆర్‌ఎఫ్ నగదు అందజేస్తూ ఆదుకుంటుందని ఎంపీటీసీ ప్రవీణ్‌పటేల్ అన్నారు. మండల పరిధిలోని ఇందూరు గ్రామానికి చెందిన కమ్మరి వెంకటమ్మకు లక్ష రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈమేరకు ఆ చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు సోమవారం ఇందూరులో ఎంపీటీసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ వచ్చిన తరువాతనే పేదలకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తట్టిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ మొగులప్ప, మాజీ ఎంపీటీసీ బాల్‌రాజ్, ముదిరాజ్ సంఘం నాయకుడు బంద్యప్ప, నేతలు రమేశ్, కుర్వ రాజు, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించడం అభినందనీయం



కుల్కచర్లలో నందినిని సన్మానిస్తున్న మండల గౌడ సంఘం నేతలు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతానికి చెందిన క్రీడాకారిణి జాతీయస్థాయిలో రాణించడం అభినందనీయమని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలె కృష్ణయ్య అన్నారు. గత డిసెంబర్‌లో ఖేలో ఇండియా క్రీడా పోటీల్లో భాగంగా హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్న నందిని జాతీయజట్టుకు ఎంపికై ంది. విద్యార్థిని స్వగ్రామం పరిగి నియోజకవర్గ పరిధిలోని గండీడు మండలం రుసుంపల్లి గ్రామం. ఈ సందర్భంగా విద్యార్థినిని ఆది, సోమవారాల్లో మండల పరిధిలోని కుల్కచర్ల, బండవెల్కిచర్ల, ఇప్పాయిపల్లి గ్రామాల గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు ముఖ్యంగా బాలికలు అన్ని సమస్యలను ఎదుర్కొంటూ జాతీయస్థాయిలో రాణించడం ఎంతో అభినందించదగ్గ అంశమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగు వెంకటయ్య, రాఘవేందర్, మహేశ్వరం రాములు, కొండయ్య, శ్రీనివాస్, నర్సింహులు, బాలు, భానుప్రకాశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటాం

రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచి మొదటిస్థానంలో నిలిచిన కుల్కచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఎర్రం కేశవులును డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతలో ఎంతో నైపుణ్యం దాగి ఉందని వారిలోని నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చేందుకు వారికి ప్రోత్సాహకాలు ఎంతో అవసరమని అన్నారు. నిరుపేద విద్యార్థులకు, యువతకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇప్పాయిపల్లి సర్పంచ్ అనురాధబాల్‌రెడ్డి, నాయకులు గోపాల్, కనకం మొగులయ్య, రఘు, శంకర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.